

## 6

## మసా అండ్ కరారా, ఇటలీ

**కళా ప్రేమికులకు** స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజిలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

## 7

## లద్దాక్, భారత్



**హిమాచల్**ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.

## 8

## బ్రెసీలియా, బ్రెజిల్



**దక్షిణ** అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో డ అల్వోరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.



## 9

## యమగూచి, జపాన్

**స్వచ్ఛమైన** ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.